దోమల నివారణకు చర్యలు తీసుకోండి


సమావేశంలో స్థానికుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: శ్రీవివేకానందనగర్ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్‌లోని చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి దోమల మందును పిచికారి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ, రోడ్ల పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులకు కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీ, బస్తీ అసోసియేషన్ల నాయకులు, డివిజన్ వాసులు సమస్యలు పరిష్కరించాలని వినతులు, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, అధికారులు, వీరారెడ్డి, ఎస్. సత్యం, పిల్లి తిరుపతి, పార్వతమ్మ, ముత్యాల దుర్గ, బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న శ్రీలక్ష్మీయాదవ్, నాయకులు

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా సెక్రటరీ పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె బీజేపీ కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సాధారణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500, నవవధువుకు కల్యాణలక్ష్మి కింద లక్ష 116 రూపాయాలతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలన్నారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి మర్చిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా హామీలు అమలు పర్చటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మహిళా మోర్చా ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాసంతి, ధరణి, జానకీ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది


దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అంజయ్యనగర్‌లో కురుమ సంఘం నాయకులు ఐలేష్, బెల్లం ఐలయ్య, లింగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిని మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకరాజుయాదవ్, మల్లికార్జునయాదవ్, కుంటన్న, మక్కాల సత్యనారాయణ, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, మంద మధుకర్, ఇర్ఫాన్, మట్టి శ్రీను, రాజుగౌడ్, బ్యాగరి నర్సింహ, షాయిన్‌షా, అశోక్, నర్సింహ, కృష్ణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, గిరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



భాగ్యనగర్‌కాలనీలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు

కూకట్‌పల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... చిన్న వయస్సులోనే మన్యం ప్రజలతో కలిసి ఆంగ్లేయులను ఎదిరించిన గొప్ప యోధుడని కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారానే భారతావనికి పరాయి పాలన నుంచి విముక్తి లభిస్తుందని నమ్మిన మహనీయుడని అన్నారు. తెల్ల దొరలపై విల్లు ఎక్కుపెట్టిన సీతారామరాజు జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు.



భాగ్యనగర్‌కాలనీలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కాంతారావు

ప్లాస్టిక్ బ్యాగులను ప్రభుత్వం నిషేధించాలి

జన విజ్ఞాన వేదిక నాయకుల వినతి

కూకట్‌పల్లి: అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ వాడక నిషేద దినం సందర్భంగా జలవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ రైతుబజార్ వద్ద గురువారం జ్యూట్ బ్యాగుల పంపిణీ జరిగింది. జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్లాస్టిక్ బ్యాగుల వాడకం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ బ్యాగులను తక్షణమే నిషేధించాలని కమిటీ అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు తిని మూగజీవాలు చనిపోతున్నాయని తెలిపారు. సముద్రాలు కలుషితం అవుతున్నాయని సాహితీవేత్త పి.శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్, క్లాత్ బ్యాగులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జానకులు రాజా, లింగస్వామి, కోశాధికారి వరప్రసాద్, ప్లాస్ బ్యాగుల వల్ల జరిగే హానిని పలు ప్రత్యామ్నాయాలను సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అధ్యక్షులు శాంతి ఇషాన్, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, శరత్ చంద్ర, సాయి, షాహిజ్ తదితరులు పాల్గొన్నారు.


కేపీహెచ్‌బీ రైతుబజార్ వద్ద జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు


గుర్రపుడెక్కతో పచ్చని మైదానాన్ని తలపిస్తున్న కాముని చెరువు

సాయంత్రమైతే..
దోమల బెడదే.!

- నివారణ చర్యలు శూన్యం
- చెరువుల్లో అల్లుకున్న గుర్రపుడెక్క
- పట్టించుకోని అధికారులు


దోమల బెడద తట్టుకోలేక పొగ పెట్టిన దృశ్యం


భరత్‌నగర్‌లోని కూరగాయల మార్కెట్‌లో..

మూసాపేట: మూసాపేట అంటేనే మినీ ఇండియా. ఇక్కడ అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తుంటారు. పైగా కూలీలు, కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతం. దోమల స్వైర విహారంతో ఈ ఏరియా ఇప్పుడు వణికిపోతోంది. సాయంత్రం 6 దాటిందంటే తలుపులు మూసుకుని దోమల బ్యాట్లతో కూర్చుంటున్నారు. ఎక్కడ చూసినా దోమల చర్చ. మూసాపేటతో పాటు సమీప ప్రాంతవాసులు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సంబంధింత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మూసాపేట, యాదవబస్తీ, జనతానగర్, ఆంజనేయనగర్, పవర్‌నగర్, ప్రగతినగర్, హబీబ్‌నగర్, భరత్‌నగర్, ఖైత్లాపూర్, శ్రీరామ్‌నగర్‌లతో పాటు రెయిన్ బో విస్టాస్, మైస్టిక్ హిల్స్ ప్రజలు చాలా ఇబ్బందులుపడుతున్నారు.

అసలు సమస్య..

ఈ ప్రాంతంలో చెరువులు, నాలాలు ఎక్కువగా ఉన్నాయి. చెరువులు, నాలాల సమీపంలో ఉన్న ప్రజలు చీకటి పడితే ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కనీసం కిటికీలు, తలుపులు తెరిచే సాహసం కూడా చేయడం లేదంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఐడీఎల్ రంగధాముని చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువుల అలుగుల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే నాలాలు ఎక్కువ పొడవు ఉండడంతో బాటు ఈ ప్రాంతం ముందు, వెనుక రెండు వైపుల నాలా ప్రవహిస్తుంది. ఇక కాముని చెరువులో గుర్రపుడెక్క అల్లుకుపోయి పచ్చని మైదానంలా కనిపిస్తుంది. మిగతా చెరువుల్లో కూడా ఈ సమస్య ఉంది. దీంతో దోమలు ప్రబలాయి.

పట్టించుకోని అధికారులు

రెయిన్ బో విస్టాస్‌వాసుల కష్టాలు వర్ణణాతీతం. కిటికీలు, తలుపులకు దోమ తెరలు బిగించుకున్నా ఇళ్లలోకి వస్తున్నాయి. కారు ఎక్కే సమయంలో డోరు తీసి, వేసే సమయంలో కారులోకి చేరిపోతున్నాయి. ఈ క్రమంలో చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గత 10 రోజుల కిందట బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే అధికారులు మున్సిపల్ కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ధర్నా చేసి ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అంటున్నారు.

దోమల నివారణ చర్యలేవి.. ?

దోమల నివారణకు కనీసం చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో గుర్రపుడెక్కను తొలగించడం లేదని, కనీసం కాలనీల్లో ఫాగింగ్ కూడా చేయడం లేదని వాపోతున్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అకస్మిక తనిఖీలు

కూకట్‌పల్లి: నగరంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శానిటేషన్‌పై గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, మూసాపేట, భరత్‌నగర్‌లోని రైతు బజార్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని నేరుగా పరిశీలించారు. వీధుల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చెత్తా చెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో మిగిలి ఉన్న జీవీపీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కామెర పురుషోత్తంకు పీహెచ్‌డీని ప్రకటించారు. మంచిర్యాల జిల్లా ములకలపేట గ్రామానికి చెందిన కామెర పురుషోత్తం 'తెలంగాణలో భావ కవిత్వం వస్తు శిల్పం' అనే అంశంపై తెలుగు విభాగంలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. తెలుగు విభాగం ఆచార్యుడు డాక్టర్ భూక్యా తిరుపతి పర్యవేక్షణలో పురుషోత్తం పీహెచ్‌డీ పూర్తి చేశారు. శుక్రవారం హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో తెలుగు ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి రాములు, గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్ ఇతర ఆచార్యులు అభినందించారు.

'గురుకుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శనం'

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకులాల్లో విద్యార్థుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శమని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీజీ-ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్న వయస్సు గల విద్యార్థులు నిరంతరం పని చేయడం కష్టతరమన్నారు. చదువులతో పాటు ఆరోగ్యం, పౌష్టికాహారం, విశ్రాంతి, నిద్ర, క్రీడలు కూడా ముఖ్యమన్నారు. గురుకుల టైమ్ టేబుల్‌ను బలవంతంగా రుద్దకుండా సవరించాలని కోరారు.

టీజీ-పీఎస్సీ ముట్టడికి మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (5న) టీజీ-పీఎస్సీ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంపు, డీఎస్సీని వాయిదా, 25000 పోస్టులతో మెగా డీఎస్సీని, రూ.4000 నిరుద్యోగ భృతి, 46 జీవో రద్దు, ఉద్యోగాలకు జాబ్ కేలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీకి మొక్కను అందజేస్తున్న జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నియమితులైన ఉపేందర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులపై జెడ్‌సీతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులకు ఆదేశించాలన్నారు. మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి చేపట్టాలని కోరారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడొద్దన్నారు. అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

మెడికల్ ఆఫీసర్‌పై ఎస్ఎఫ్ఏల ఫిర్యాదు


డీసీ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఏలు

కూకట్‌పల్లి: ఏడాదిగా మూసాపేట సర్కిల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాల్మన్‌రాజ్ అరాచకాలు తట్టుకోలేకపోతున్నామని ఎస్ఎఫ్ఏలు గురువారం డీసీకి ఫిర్యాదు చేశారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. వారికి ఇవ్వాల్సిన సామగ్రి సకాలంలో అందడం లేదని ఇచ్చే సామగ్రి కూడా అరకొరగా ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయం మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తే దుర్భాషలాడి దాడికి యత్నించారని తెలిపారు. ఆయన తీరు ఖండిస్తూ ఎస్ఎఫ్ఏలు విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.

ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే.. వారు కంపెనీని జాగ్రత్తగా చూసుకుంటారు

టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సువర్ణమిత్ర


టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ సువర్ణమిత్ర, ప్రియాగజ్దర్

రాయదుర్గం: మీరు ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారు వ్యాపారం, కంపెనీని బాగా చూస్తారని టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సువర్ణమిత్ర అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'టాటా లెగసీ-లివింగ్ వాల్యూస్' అనే అంశంపై గురువారం సమావేశం జరిగింది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్‌తో ఆమె ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణమిత్ర పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వ్యక్తిగతంగా కంటే మహిళలు కలిసి, సామూహికంగా జట్టుగా ఉంటే అందంగా, బలంగా ఉంటారన్నారు, చేతి గడియారాలు ఎప్పటికీ చెలామణిలో నుంచి పోవని స్పష్టం చేశారు. ప్రస్తుత మొబైల్ ఫోన్ల యుగంలోనూ చేతి గడియారాలు పాతబడిపోలేదన్నారు. ప్రియాగజ్దర్ మాట్లాడుతూ వ్యక్తుల కేంద్రీకృత విలువలు, మానవీయ దృక్పథం దాని జీవనాధారమని చెప్పారు.

బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాలి


డీసీ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లో ఈ నెలాఖరి వారంలో బోనాల జాతర ఉందని కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ అన్నారు. దేవాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గురువారం ఆయన డీసీ రమేష్‌ను కోరారు. హనుమాన్ చౌక్ నుంచి చిత్తారమ్మ దేవాలయానికి వెళ్లే దారి వెంట తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గల్లీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పనిచేయని వాటికి మరమ్మతులు చేయాలని కోరారు. వేలాది మంది భక్తులు తరలి వస్తారని వారిని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి, బీజేవైఎం అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ, పదోన్నతి సర్వసాధారణం


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో విద్యార్థులు, నాగుల సత్యం

మోతీనగర్: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ, పదోన్నతి, ఉద్యోగ విరమణ సర్వసాధారణమని బీఆర్ఎస్ కూకట్‌పల్లి బీసీసెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర అన్నారు. వి.రామారావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ ఎల్లమ్మబండకు, రాధా అనే ఉపాధ్యాయురాలు అల్వాల్‌కు బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం తరపున గురువారం ఉపాధ్యాయులను సన్మానించారు. వారి స్థానంలో వచ్చిన ఉపాధ్యాయులు హయగ్రీవ చారి, ప్రసన్నలక్ష్మిని సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగుల ఉమారాణి, నాయకులు సాంబశివ, ఆవుల సంజీవ పటేల్, కుమార్, జాన్‌ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

రూపదేవి ఆత్మకు శాంతి చేకూరాలి


రూపాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


ఆల్విన్‌కాలనీ: చొప్పందండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపదేవి అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం అల్వాల్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూపదేవి మరణం చాలా బాధాకరమని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చల్లా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


విద్యా సంచాలకులు నరసింహారెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు

కూకట్‌పల్లి: పాఠశాల విద్యా సంచాలకులు నరసింహారెడ్డిని గురువారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భాషా పండితుల పదోన్నతులు ప్రక్రియ సజావుగా కొనసాగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పదోన్నతుల ప్రక్రియలో రోస్టర్ విధానంలో జరిగిన పొరపాట్లను, మిగిలిపోయిన భాషా పండితుల పోస్టులను అప్‌డేట్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతి కృష్ణ, కోశాధికారి వివిఎస్ఎస్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి



పేదల పక్షపాతి వంగవీటి మోహనరంగా జయంతిని గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
– కూకట్‌పల్లి

